సాక్షి తిరుపతి

శనివారం । 21 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.48,750
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.4,410

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.66,600
రిటైల్ వెండి గ్రాము	రూ.69.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	17
చిత్తూరు	31	17
తిరుమల	26	13
గూడూరు	31	19
నగరి	32	18



రథసప్తమికి ఏర్పాట్లు

తిరుమల: తిరుమలలో ఈనెల 28న రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఒక్కరోజు పండగ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మాడ వీధుల్లో రంగుల ముగ్గులు వేస్తున్నారు.

న్యూస్‌రీల్

రేపు స్పెల్‌బీ సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ (మూడవ రౌండ్) పరీక్ష ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కేటగిరీల వారీగా తిరుచానూరు రోడ్డు. పద్మావతీపురంలోని హోలీగ్రీన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇదివరకు పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చూపి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తిరుపతి, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వాలన్నారు. ఉదయం 10నుంచి 10.30గంటల వరకు కేటగిరి–1, 10.30నుంచి 11గంటల వరకు కేటగిరి–2, 11నుంచి 11.30గంటల వరకు కేటగిరి–3, 11.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కేటగిరి–4 విభాగాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా వారి స్కూల్ యూనిఫాం, ఐడీ కార్డుతోపాటు పెన్ను/పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్‌తో పరీక్ష సమయానికి ముందే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన తరువాత అనుమతి ఉండదని ఆయన పేర్కొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

తిరుపతి అలిపిరి: రాష్ట్రంలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు పలువురు డిప్యూటీ కలెక్టర్లు నియమితులయ్యారు. టీటీడీ డిప్యూటీ ఈవోగా కే.రాజగోపాల్‌రావు రెవెన్యూ(దేవాదాయశాఖ)నుంచి తిరుపతికి బదిలీ అయ్యారు. చిత్తూరు ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా టీ.చంద్రశేఖర్ నాయుడు, తిరుపతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ప్రొటోకాల్)గా టి.భాస్కర్‌నాయుడు, సూళ్లూరుపేట ఆర్డీవోగా ఆర్.చంద్రముని, తిరుపతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(జీఎస్ఎస్ఎస్, యూనిట్–1)గా డి.కోదండరామిరెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు.

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీ సువిద్యేంద్రతీర్థ స్వామీజీ

తిరుమల: భగవన్నామస్మరణతోనే మానవుల కష్టాలు దూరమవుతాయని బెంగళూరులోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠాధిపతి శ్రీ సువిద్యేంద్రతీర్థ స్వామీజీ ఉద్ఘాటించారు. శ్రీవారి పరమభక్తుడు, కర్ణాటక సంగీత పితామహుడు అయిన శ్రీపురందరదాసు ఆరాధన మహోత్సవాలు టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలలోని ఆస్థాన మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. నేడు వేలాదిమంది భక్తులు పురందరదాసు రచించిన లక్షలాది కీర్తనలు ఆలపిస్తూ స్వామివారి కృపకు పాత్రులు అవుతున్నారని చెప్పారు. ఇదే కలియుగంలో నామ సంకీర్తనకున్న వైశిష్ట్యమన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ 4.75 లక్షల సంకీర్తనలు రచించడం పురందరదాసుకే సాధ్యమైందని తెలిపారు. పురందరదాసు కీర్తనలు యావత్తూ లోకోక్తులేనన్నారు. అనంతరం స్వామీజీని శాలువ, శ్రీవారి ప్రసాదంతో సన్మానించారు. అంతకుముందు ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. దాస సంకీర్తనలను భజన మండళ్ల సభ్యులు చక్కగా ఆలపించారు.

నేడు సంకీర్తనాలాపన

ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి శ్రీ పురందరదాస సంకీర్తనల బృందగానం నిర్వహిస్తారు. ఈనెల 22న తిరుమలలోని ఆస్థానమండపంలో భజన కార్యక్రమాలు, నగర సంకీర్తనం తదితర కార్యక్రమాలు చేపడతారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల పార్లమెంటరీ కమిటీ

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. పెట్రోల్, నేచురల్ గ్యాస్ పార్లమెంటరీ కమిటీ సభ్యులతోపాటు డిఫెన్స్ ఐజీ డీకే సింగ్, తెలంగాణ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

దారుకు జీవం.. కళకు ప్రాణం

దేవుడే దిగివచ్చాడా..తనకు తానే ఈ బొమ్మల్లో ఒదిగిపోయి ఊపిరి పోసుకున్నాడా అనిపిస్తుంది ఈ దారు శిల్పాల హస్తకళా చాతుర్యాన్ని తిలకిస్తే. దేనికదే దివ్యకళా దృష్టితో దర్శనమిస్తుంది. నాట్యగణపతి, శ్రీవేంకటేశ్వరస్వామి, దశావతారాలు, అష్టలక్ష్ములు, సకల దేవతాస్వరూపాలు.. గృహోపకరణాల కళాకృతులు ఒకదానికి మరొకటి జీవం పోసుకుంటూ సృష్టికి ప్రతిసృష్టి చేస్తోంది తొరూరు.





బొమ్మలు చెక్కుతున్న కళాకారులు

- దారు కళల కాణాచి తొరూరు
- కొయ్యకు ప్రాణం పోసే కళాకారులు
- అద్భుత కళాఖండాల సృష్టికి గని

పుత్తూరు రూరల్: దారు(చెక్క) శిల్పాల కళాఖండాల కాణాచిగా తొరూరు గ్రామం గుర్తింపు పొందింది. ఇది పుత్తూరు పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామంలోని వారంతా వ్యవసాయం, కూలి పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు 40 కుటుంబాలు దారుబొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రసిద్ధి చెందిన ఆలయాల నుంచి గ్రామ స్థాయి ఆలయాల్లోని దేవతామూర్తుల కళాకృతులు ఈ కళాకారుల చేతుల్లో ఒదిగి పోతాయి. ఆరు దశాబ్దాల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఎం రామలింగం దారు బొమ్మలు చెక్కడంపై చూపించిన చొరవ గ్రామానికే కీర్తిని తెచ్చి పెట్టింది. తాను నేర్చుకున్న కళ తనతోనే అంతరించి పోకుండా మరి కొందరికి బొమ్మలు చెక్కడంపై ఆయన శిక్షణ ఇచ్చాడు. దీంతో పలు కుటుంబాలకు బొమ్మల తయారీ జీవనాధారమైంది. తొలుత చిన్న చిన్న బొమ్మలను మాత్రమే తయారు చేసేవారు. వీటిని అమ్ముకోవడం పెద్ద సమస్యగా ఉండేది. దీంతో రామలింగం మద్రాసుకు వెళ్లి వాటిని అమ్ముకొని వచ్చేవారు. క్రమేపీ కళాకృతులను హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, ఢిల్లీ, ముంబయి వంటి పట్టణాలకు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండడంతో వ్యాపారాలు ఆశాజనకంగా ఉన్నట్లు కళాకారులు చెబుతున్నారు.

ఒకదానికి మించి మరొకటి..

ప్రస్తుతం ఆరడుగుల నిలువెత్తు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ సత్యభామ, గణపతి వంటి బొమ్మలతో పాటు గృహోపకరణాలకు సంబంధించి ఏనుగు తల, గుర్రం, దశావతారం, తోరణాలు వంటి కళాకృతులు అందంగా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వీటిని ప్రతి నెలా నగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్లలో పెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వీరికి చేయూతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎగ్జిబిషన్స్‌లో పెట్టే స్టాల్స్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఉచిత వసతి సౌకర్యం కల్పిస్తోంది.





శ్రీవేంకటేశ్వరస్వామి

గ్రామం : **తొరూరు**

మండలం : **పుత్తూరు**

జిల్లా : **తిరుపతి**

కళా కారులు : **40 కుటుంబాల వారు దారు కళాఖండాల తయారీలో దేశవ్యాప్త గుర్తింపు**



శ్రీకృష్ణ



చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం



మా తండ్రి రామలింగం అందించిన బొమ్మల తయారీని వృత్తిగా కొనసాగిస్తున్నా. ప్రస్తుతం 20 మందికి పనికల్పిస్తున్నా. ప్రభుత్వం తక్కువ వడ్డీతో ఆర్థిక సాయం చేస్తే మేలైన కళాఖండాలను అందిస్తాం. ప్రస్తుతం కొయ్యల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లోని ఎగ్జిబిషన్స్‌లో అమ్మకాలు జరపాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరం. ఇందుకు ప్రభుత్వ పరంగా చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తాం. మా ప్రతిభకు తగిన గుర్తింపు వస్తే అంతకుమించి ఏమీ అవసరం లేదు.

ఎం.వెంకటేష్, దారుశిల్పి, తొరూరు, పుత్తూరు మండలం

15 ఏళ్లుగా ఇదే వృత్తి



పదిహేనేళ్లుగా బొమ్మల తయారీ పనిచేస్తున్నా. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఈ బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బొమ్మల తయారీలో ఓపిక, సహనం అవసరం. ఏమాత్రం పొరబాటు జరిగినా మొత్తం చెక్కను పడేయాల్సిందే. మా కూలి ప్రస్తుత ధరకు సరిపోవడం లేదు. ప్రభుత్వం మాలాంటి కళాకారులకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి. పెట్టుబడికి ప్రభుత్వం సాయం చేస్తే ఎంతో మంది ఇలాంటి చేతి వృత్తుల పట్ల ఆసక్తి చూపుతారు.

– మాధవయ్య, చెక్క శిల్పాల కళాకారుడు, తొరూరు

కార్యకర్తలకు అండగా ఉంటాం

- టీడీపీ శ్రేణులు ధోరణి మార్చుకోవాలి
- తీరుమారకుంటే తగిన బుద్ధి చెబుతాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని అటవీ, భూగర్భ గనులు, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. రొంపిచెర్ల పర్యటనలో ఉన్న మంత్రిని శుక్రవారం పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కలిశారు. మండలంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. రెండు వారాల కిందట వైఎస్సార్ సీపీ బ్యానర్లు చించివేసి తమపైనే దాడి చేశారని చెప్పారు. తాజాగా శ్రీరాముల గుడి ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొనకూడదని దాడులు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరు టీడీపీ దాడులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ కార్యకర్తలు దాడులు చేసేందుకే రెచ్చ గొడుతున్నారని, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. టీడీపీ శ్రేణులు ధోరణి మార్చుకోకపోతే తగినరీతిలో సమాధానం చెప్పాల్సి ఉంటుందని మంత్రి పెద్దిరెడ్డి హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీకి తీరని లోటు

వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, రెడ్డిచిన్నప్ప నాయుడు మృతి పార్టీకి తీరని లోటని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి, గడ్డాలవారిపల్లెకి చెందిన రెడ్డిచిన్నప్పనాయుడు గురువారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న మంత్రి శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలను సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, అన్సర్‌బాషా, నాయకులు చెంచురెడ్డి, సలీంబాషా, సూర్యనారాయణ రెడ్డి, చిన్న నాగరాజ, లక్ష్మయ్య, అమరనాథరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కరీముల్లా తదితరులు ఉన్నారు.

రిజర్వాయర్ పనుల పరిశీలన

సోమల: మండలంలోని ఆవులపల్లె వద్ద దాదాపు రూ.750 కోట్లతో నిర్మిస్తున్న సీతమ్మ చెరువు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను మంత్రి పెద్దిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ పరంగా ఆదుకుని నష్టపరిహారాన్ని అందిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల అధ్యక్షుడు గంగాధరం, మైనారిటీ అధ్యక్షుడు మస్తాన్ వలీ, సర్పంచ్ కోదండరాజు, నేతలు నాగభూషణంరెడ్డి, వెంకటరెడ్డి, ఝాన్సీలక్ష్మి, వీవీ రమణ పాల్గొన్నారు.

తిరునగరికి 'హృదయ' కీర్తి



తిరుపతి తుడా : తిరునగరి కీర్తి కిరీటంలో మరో మైలు రాయి చేరింది. తొలిసారిగా చేసిన గుండెమార్పిడి చికిత్స విజయవంతమైంది. శ్రీపద్మావతి హృదయాలయ వైద్యులు బాలుడికి విజయవంతంగా గుండెమార్పిడి చేసి ఈ ఖ్యాతిని దక్కించుకున్నారు. ఆస్పత్రి ప్రారంభించిన అనతి కాలంలోనే అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. హృద్రోగంతో బాధపడుతున్న అన్నమయ్య జిల్లాకు చెందిన 15ఏళ్ల బాలుడికి గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. ఇది తిరుపతి చరిత్రలోనే ప్రథమం కావడంతో నగరవాసుల్లో ఉత్సుకతను రేపింది. దీంతో గుండెను విమానాశ్రయం నుంచి తీసుకొస్తున్న అంబులెన్సుకు నిర్మానుష్యమైన రోడ్డును అప్పగించారు. ప్రజలందరూ రోడ్డు పక్కన నిలుచుని ఆ అంబులెన్స్‌ను చూస్తూ గుండెను తరలిస్తున్న విషయంపై చర్చించుకున్నారు. అయితే గుండె తరలించడం, బాలుడికి అమర్చడం ఉరుకులు పరుగుల మీద జరిగిపోయాయి. ఈ గుండెను రేణిగుంట విమానాశ్రయం నుంచి తీసుకొచ్చిన టీటీడీ అంబులెన్స్ డ్రైవర్ సింగంశెట్టి శంకరయ్య సరికొత్త అనుభూతినిచ్చిందని తెలిపాడు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

85559 74855

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మత సామరస్యానికి ప్రతీక గంధ మహోత్సవం



గంధ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: ముస్లింలు ఎంతో పవిత్రంగా నిర్వహించే గంధ మహోత్సవం మత సామరస్యానికి ప్రతీక అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక గేట్‌పుత్తూరులోని నాగూర్ ఖాదర్‌వల్లీ దర్గాలో జరిగిన గంధ మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే గంధ మహోత్సవాల్లో హిందూముస్లింలు పాల్గొనడం మత సామరస్యానికి ప్రతీక అని తెలిపారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీఎం మాహీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

మెగాకు భయపడే విమర్శలు

నగరి: చిన్న తారలందరూ భయంతోనే మెగా ఫ్యామిలీతో ఉన్నారని పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. చిన్నతారలు మంత్రులపై కామెంట్లు చేయడంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. భయంతోనే పలువురు తారలు మెగా ఫ్యామిలీతో ఉన్నారు తప్ప ప్రేమతో కాదన్నారు. మెగా ఫ్యామిలీలో ఆరేడుగురు హీరోలు ఉన్నారని, వారి మాట వినకుంటే తమకు సినిమాల్లో అవకాశాలు రావని ప్రేమ నటిస్తూ వారివెంట ఉన్నారన్నారు. నటులు నిజమైన ప్రేమతో వెంట ఉంటే వారు సపోర్టు చేసిన ప్రకాష్‌రాజ్ 'మా' ఎన్నికల్లో ఎందుకు గెలవలేక పోయారని ప్రశ్నించారు. వ్యతిరేకంగా మాట్లాడితే ఇండస్ట్రీలో లేకుండా చేస్తారేమోననే భయంతో చిన్ననటులు వారు చెప్పినట్లు మాట్లాడుతున్నారన్నారు. భయంతో మాట్లాడినా మంత్రులనుద్దేశించి మాట్లాడే సమయంలో విజ్ఞత, వివేకం అవసరమని సూచించారు.

క్లుప్తంగా

శ్రీసిటీలో 157 మందికి ఉద్యోగాలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట: జిల్లాలోని సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లో విస్తరించి వున్న శ్రీసిటీ సెజ్‌లో ఉద్యోగాల కోసం సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో 157 మంది ఎంపికయ్యారు. శ్రీసిటీలోని హావెల్స్ ఇండియా లిమిటెడ్, బ్లూస్టార్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. డిగ్రీ, ఇంటర్, ఎస్ఎస్‌సీ, ఐటీఐ పూర్తి చేసిన వారు సుమారు 300 మంది హాజరుకాగా అందులో 157 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ మధుబాబు, జేకేసీ కో–ఆర్డినేటర్ ఎం యల్లమందరావు, నాక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వీ రాజా తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన బైక్.. రాత్రంతా లోయలోనే..

బైక్ అదుపుతప్పి సుమారు 65 అడుగుల లోయలోకి పడిపోయిన వ్యక్తి తీవ్ర గాయాలపాలై 24 గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపాడు. లోయలోనుంచి ఆర్తనాదాలు విన్న విద్యుత్ శాఖ ఏఈ స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సుమారు 5 గంటలపాటు శ్రమించి క్షతగాత్రుడిని ప్రాణాలతో బయటికి తీశారు.

- 24 గంటల తరువాత వెలికి తీసిన అగ్నిమాపక సిబ్బంది
- శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలింపు



లోయలో పడిపోయిన దేవా



క్షతగాత్రుడిని తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కేవీబీపురం: మండల కేంద్రానికి చెందిన దేవా (34) స్థానిక రైస్‌మిల్లులో పనిచేసేవాడు. రామాపురంలోని సోదరి ఇంటికెళ్లి గురువారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కేవీబీపురానికి బయల్దేరాడు. మార్గ మధ్యంలో బైక్ అదుపు తప్పి రామాపురం డ్యాం లోయలో పడిపోయాడు. కాళ్లు విరిగిపోయి, తలకు దెబ్బ తగలడంతో స్పృహ కోల్పోయాడు. కొన్ని గంటల తరువాత స్పృహ వచ్చింది. అయితే అప్పటికే చీకటిపడిపోవడం, తాను కదల్లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ అక్కడే రాత్రంతా ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం అటుగా వెళుతున్న వాహనాల శబ్దాలు విని కాపాడండి అంటూ కేకలు వేశాడు. లోయ పైనున్న గుట్ట ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ఏఈ వెంకీ ఆర్తనాదాలు విని, బాధితుడి వద్దకు చేరుకున్నాడు. నీటిని తాగించి, వెంటనే 108 సిబ్బందికి, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి ఏడీఎఫ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ ఎల్ఎఫ్ నాగార్జున్ రెడ్డి, ఎల్ఎఫ్ సునీల్‌కుమార్, డీపీఓ ధనశేఖర్, ఎఫ్ఎంలు శివయ్య, ఎఫ్ఎం రాజా వెంటనే అక్కడికి చేరుకున్నారు. అతికష్టం మీద సుమారు 5 గంటల పాటు శ్రమించి అతన్ని ప్రాణాలతోనే లోయలో నుంచి బయటకు తీసుకొచ్చారు. 108 సిబ్బంది అక్కడే ప్రథమ చికిత్స అందించి, శ్రీకాళహస్తి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌బీకేలు రైతులకు వరం



సమావేశంలో మాట్లాడుతున్న కోనేటి ఆదిమూలం

తిరుపతి అర్బన్: రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరంలా మారాయని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని వివరించారు. విత్తు నుంచి ధాన్యం కొనుగోలు చేయడం వరకు ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైతులకు సాయం చేస్తుందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు ఉన్న ఊర్లోనే అందుబాటులో ఉన్నాయని, దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో)ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో లక్ష హెక్టార్లు వరి పంట సాగు చేశారని వెల్లడించారు. ఆ మేరకు రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధం చేసినట్లు తెలిపారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు పంట దిగుబడి, ఎరువులు గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కలెక్టరేట్ ఏడీఏ ధనంజయరెడ్డి, ఉద్యానశాఖ హెచ్‌వో సునీల్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రవికుమార్, జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణి, రీజినల్ అగ్రికల్చర్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ హారతి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో రచ్చబండ





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి, సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

- నేరాల నియంత్రణకు సమష్టి కృషి
- ఎస్పీ పరమేశ్వర రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రచ్చబండ నిర్వహించాలని ఎస్పీ పరమేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని కల్యాణ మండపంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మట్లాడుతూ, నేరాల నియంత్రణకు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇది విజిబుల్ పోలీసింగ్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లలో పని భారం ఎంత ఉన్నా స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రారంభ దశలోనే పరిష్కరించాలని ఆదేశించారు. మారుతున్న చట్టాలకు అనుగుణంగా పోలీసులు నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి, స్టేషన్ అధికారి తమ పరిధిలోని ప్రతి గ్రామాన్ని నెలకోసారి తప్పనిసరిగా సందర్శించడం వల్ల నేరాల శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. పెండింగులో ఉన్న మిస్సింగ్ కేసుల విషయంలో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన దిశా యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించి, దాన్ని ఉపయోగించే విధంగా కృషి చేయాలని కోరారు. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశాలు ఇచ్చారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు చైల్డ్ వెల్ఫేర్ వారి సహకారంతో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల కుమారి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్

- రేపటి పరీక్షలకు రెండు జిల్లాల్లో సర్వం సిద్ధం
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- చిత్తూరు జిల్లాలో 33 కేంద్రాలు.. 12,196 మంది అభ్యర్థులు
- తిరుపతిలో 57 కేంద్రాలు.. 31,588 మంది అభ్యర్థుల దరఖాస్తు
- వివరాలు వెల్లడించిన ఎస్పీలు రిషాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి



చిత్తూరులో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి



తిరుపతి : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర రెడ్డి

చిత్తూరు అర్బన్/ తిరుపతి క్రైమ్: పోలీసు కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రిలిమ్స్ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43,784 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. చిత్తూరు జిల్లాలో 33, తిరుపతి జిల్లాలో 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం పోలీసుశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం చిత్తూరులో ఎస్పీ రిషాంత్‌రెడ్డి, తిరుపతిలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ప్రిలిమ్స్ పరీక్షల వివరాలను మీడియాకు వెల్లడించారు. ఎస్పీలు మాట్లాడుతూ ..

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో 110 పోస్టులు, చిత్తూరు జిల్లాలో 240 కానిస్టేబుల్‌తో పాటు 630 ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఈనెల 22వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహించనుంది. అభ్యర్థులను 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 10 దాటిన తరువాత నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు జనాలు గుమికూడి ఉండడం నిషేధం. సీసీ కెమెరాల నిఘా నీడన పరీక్షలు జరుగుతాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి తీసుకురాకూడదు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు ఒకటి, బ్లూ, బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే అనుమతిస్తారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్ పాల్పడితే జీవితంలో ఎపుడూ పోలీసు ఉద్యోగాలకు హాజరుకాకుండా కఠినంగా వ్యవహరిస్తారు. పరీక్షల్లో పాస్ చేయిస్తామని చెప్పే దళారీలు నమ్మొద్దు. ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు ఎవరైనా సంప్రదిస్తే డయల్–100కు సమాచారం ఇవ్వాలి. దళారీలను నమ్మి డబ్బులు పోగొట్టుకోవద్దు. ఎంపిక ప్రక్రియ మొత్తం పారదర్శకంగా జరుగుతుందని వారు వివరించారు.

పరిశ్రమల స్థాపనకు అనుకూలం



ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

వరదయ్యపాళెం: పరిశ్రమల స్థాపనకు జిల్లా అనుకూలమని, అన్ని విధాల సహకారం అందిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. శ్రీసిటీలోని వ్యాపార వాణిజ్య కేంద్రంలో శుక్రవారం వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటుకు తిరుపతి జిల్లాలో అన్నిరకాల అనుకూలతలు ఉన్నాయన్నారు. ప్రధానంగా రైల్వే, విమాన మార్గాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ డెస్క్ పారిశ్రామిక విధానంలో అనుమతులు ఇస్తూ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహిస్తోందని చెప్పారు.

నైపుణ్య ఉద్యోగుల కొరత

సమావేశంలో కొన్ని పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఐటీ, డిప్లొమా అభ్యర్థులు తగినంత మంది లేని కారణంగా నైపుణ్యం గల ఉద్యోగుల కొరత ఏర్పడుతోందని చెప్పారు. స్పందించిన కలెక్టర్, ఇతర జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ కిరణ్‌కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహాన సోని, సీపీఓ అశోక్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నాగేశ్వరరావు, ఇతర అధికారులు 120 పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కొరియావర్సిటీ పరిశోధకుడిగా శ్రీనివాసులు



శ్రీనివాసులుకు ఉత్తర్వులను అందజేస్తున్న వీసీ రాజారెడ్డి

తిరుచానూరు: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం జియాలజీ విభాగంలో సురేష్ పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్న జి.శ్రీనివాసులును కొరియాలోని ఇన్హా యూనివర్సిటీ ఓషనోగ్రఫీ డిపార్ట్‌మెంట్ పరిశోధకుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ వర్శిటీ ఏడాదికి రూ.30 లక్షలు వేతనం ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులను శుక్రవారం పరిశోధకుడు శ్రీనివాసులుకు వర్శిటీ వీసీ కె.రాజారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ జియాలజీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.మధు, పర్యవేక్షకుడు టి.సురేష్ పాల్గొన్నారు.

మహిళావర్సిటీకి నిధి-ప్రయాస్ సెంటర్ మంజూరు

తిరుచానూరు: కేంద్ర ప్రభుత్వం మహిళా వర్సిటీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం డిఎస్టీ నిధి–ప్రయాస్ సెంటర్ మంజూరు చేసింది. మహిళావర్సిటీలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎకో–సిస్టమ్‌ను బలోపేతం చేయడంలో, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌కి నిధి–ప్రయాస్ సెంటర్ తీసుకురావడంలో మాజీ వీసీ దువ్వూరి జమున, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డీఎం.మమత ప్రధాన పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం క్రింద ప్రతి ప్రయాస్ కేంద్రానికి ఐదేళ్ల పాటు సహాయం అందించనున్నారు. మొదటి ఏడాది గ్రాంటులో భాగంగా ప్రత్యేక ఫ్యాబ్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.2.20 కోట్లు మంజూరు చేశారు.

తిరుమలలో వ్యక్తి అదృశ్యం



సూర్యనారాయణ

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చి ఓ వ్యక్తి ఆరో తేదీన అదృశ్యమయ్యాడు. తిరుమల వన్ టౌన్ ఎస్ఐ వెంకటచిన్న శుక్రవారం ఆ వివరాలు మీడియాకు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా, అంబాజీపేటకు చెందిన సూర్యనారాయణ(60) ఈనెల ఆరో తేదీన కుటుంబీకులతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చాడు. శ్రీవారి ఆలయంలోని హుండీ వద్ద ఆయన తప్పిపోయాడు. బయట వచ్చి చుట్టుపక్కల వెతికినా ఎంతకూ దొరకపోవడంతో వారి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. ఇతనికి మతిస్థిమితం లేదని, అందుకే ఇలా జరిగిందని తెలిపారు. ఇతను ఆచూకీ తెలిస్తే 9440796771ను సంప్రదించాలని కోరారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



సుధీర్ (ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని అనకవోలు గ్రామానికి చెందిన వివరం సుధీర్(26) భార్య కాపురానికి రాలేదని మనస్థాపంతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని దళితకాలనీకి చెందిన సుధీర్ పుట్టుకతో దివ్యాంగుడు. ఐదు నెలల కిందట కలవకూరు గ్రామానికి చెందిన దేవకీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల పుట్టింటికి వెళ్లిన దేవకి కాపురానికి రాకపోవడంతో మనస్థాపం చెంది బుధవారం పురుగుమందు తాగాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సుధీర్ మృతితో కాలనీలో విషాదం నెలకొంది.

మినరల్ వాటర్ ప్లాంట్లపై దాడులు



వాటర్ ప్లాంట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి క్రైం: ఉభయ జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన మినరల్ వాటర్ ప్లాంట్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేసి దాడులు నిర్వహించారు. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు పాపానాయుడుపేట, వడమాల పేట, చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని మినరల్ వాటర్ ప్లాంట్, ఆర్వో వాటర్ ప్లాంట్లలో తనిఖీలు చేశారు. యజమానులు తగిన లైసెన్సులు, నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల ఆలయంపై డ్రోన్‌తో చిత్రీకరణ?

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఒక పోస్ట్ ఇన్‌స్టాగామ్‌లో శుక్రవారం ప్రత్యక్షం కావడం సోషల్ మీడియాలో కలకలం సృష్టించింది. ఆగమశాస్త్రం ప్రకారం తిరుమల శ్రీవారి ఆలయంపై ఎటువంటి వస్తువులు ఎగరడానికి వీలులేదు. విమానాలను సైతం శ్రీవారి ఆలయంవైపు వెళ్లకుండా చూడాలని గతంలోనే పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో శ్రీవారి ఆలయాన్ని పైనుంచి డ్రోన్ ద్వారా చిత్రీకరించిన వీడియోను ఇన్‌స్టాగామ్‌లో ఉంచారు. సాధారణంగా శ్రీవారి ఆలయం ఎదుట ఫొటో దుకాణదారులు ఆలయం వెలుపల భక్తులను ఫొటోలు తీస్తేనే దాదాపు 30 కెమెరాల వరకు సీజ్‌చేసి హుండీలో వేశారు.

క్రిమినల్ కేసు నమోదు చేస్తాం

సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న వీడియో వాస్తవం కాదు. తిరుమలలో కట్టుదిట్టమైన భద్రత ఉండడం వల్ల శ్రీవారి ఆలయాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం సాధ్యం కాదు. గత నవంబర్‌లో ఈ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినట్లు గుర్తించాం. ఆ వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పరిశీలిస్తాం. సదరు వీడియోను పరిశీలించిన అనంతరం ఇందుకు కారకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– నరసింహకిషోర్ టీటీడీ సీవీ అండ్ ఎస్వో

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

బంగారుపాళెం: క్రీడా పోటీలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం సౌత్ ఇండియా ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. దీన్ని వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, క్రీడలతో సమైక్యత, స్నేహబంధం బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. శారీరక, మానసిక ఉత్తేజానికి క్రీడలు అవసరమని చెప్పారు. క్రీడలతో ఏకాగ్రత, పట్టుదల పెంపొందుతాయని తెలిపారు. ఇటువంటి పోటీలు యువతలో క్రీడాసక్తిని పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ, బంగారుపాళెం మండలం వాలీబాల్‌కు పెట్టింది పేరని అన్నారు. వాలీబాల్ క్రీడలో మండలం నుంచి ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రారంభ పోటీలలో తమిళనాడు పోలీస్ జట్టు–మద్రాసు యూనివర్సిటీ జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నై బ్లిట్జ్ యాజమాన్యం హనీమీరెడ్డి, విక్రాంత్‌రెడ్డి, కిరణ్ తులసిరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ ఉష తదితరులు పాల్గొన్నారు.